ఏళ్లనాటి వెతలు దూరం

- రూ.90లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- ముమ్మరంగా సాగుతున్న పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న టీచర్స్ కాలనీవాసులు


రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన డ్రైనేజీలు


కొనసాగుతున్న సీసీరోడ్డు పనులు

కైలాస్‌నగర్: గత మున్సిపల్ ఎన్నికలకు ముందు ఆదిలాబాద్ పట్టణంలో విలీనమైన టీచర్స్‌కాలనీలో గత ఐదేళ్లుగా ఆశించినస్థాయిలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదు. పంచాయతీ పరిధిలో ఉన్నప్పుడు చేపట్టిన పనులే తప్ప ఇటీవల ముగిసిన పాలకవర్గ హయాంలో కొత్తగా పనులేమి మంజూరు చేయలేదు. ప్రధానంగా పాత జాతీయ రహదారి నుంచి సాయిబాబా ఆలయం వరకు గల ప్రధాన రోడ్డు అధ్వానంగా ఉండేది. డ్రెయినేజీల నిర్మాణాలు సైతం లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపై ప్రవహించేది. ముఖ్యంగా వర్షాకాలంలోనైతే రోడ్డంతా నీరు నిలిచి రెండు రోజుల పాటు నడువలేని పరిస్థితి ఉండేది. దీనిపై కాలనీవాసులు, మాజీ కౌన్సిలర్ పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించగా స్పందించిన బల్దియా అధికారులు ఎట్టకేలకు నిధులు కేటాయించారు. టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను ప్రారంభించగా అవి ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అయితే పనులు పర్యవేక్షించాల్సిన బల్దియా ఇంజనీరింగ్ అధికారులు అటువైపు దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తొలగనున్న ఇబ్బందులు..

మున్సిపల్ కౌన్సిల్ గడువు ముగింపు సమయంలో ప్రభుత్వం ఆదిలాబాద్ మున్సిపాలిటీకి టీయూఎఫ్ఐడీసీ కింద రూ.10.5 కోట్ల నిధులను విడుదల చేసింది. అందులో టీచర్స్‌కాలనీకి రూ.1.20 కోట్ల నిధులను బల్దియా అధికారులు కేటాయించారు. ఆనిధులతో సీసీరోడ్డుతో పాటు దానికి ఇరువైపులా సీసీ డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. పనులకు రాష్ట్రస్థాయిలో టెండర్ల ప్రక్రియ నిర్వహించగా హైదరాబాద్‌కు చెందిన రణిత ఇన్‌ఫ్రా అనే సంస్థ దక్కించుకుంది. సదరు కాంట్రాక్టర్ ఇటీవల పనులు ప్రారంభించారు. దీంతో కాలనీవాసులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది.

పర్యవేక్షణ కరవు..

అయితే పనులపై బల్దియా అధికారుల పర్యవేక్షణ కరువైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాణ్యత ప్రమాణాలకనుగుణంగా పనులు జరిగేలా చూడాల్సిన ఇంజనీరింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఫలితంగా కాంట్రాక్టర్ తన ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇబ్బందులు తొలగనున్నాయి



అధ్వానంగా మారిన రోడ్డుతో ఏళ్ల తరబడి ఇబ్బంది పడ్డాం. గుంతలమయంగా మారిన రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు ఎదుర్కొన్నాం. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిండి ప్రమాదాలు సైతం జరిగేవి. డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపై ప్రవహించి దుర్గంధం వ్యాపించేది.

– ఎండీ. సిరాజ్, కాలనీవాసి

క్లుప్తంగా

నర్సరీ మొక్కలను రక్షించాలి

ఇచ్చోడ: వేసవిలో రోజు రోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్నందున నర్సరీలో మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. గురువారం మండలంలోని ఇస్లాంనగర్ నర్సరీలో పెరుగుతున్న మొక్కలను పరిశీలించారు. మొక్కలకు ప్రతీరోజు రెండు సార్లు నీరు పోయాలన్నారు.

ఇంటింటా ర్యాపిడ్ ఫీవర్ సర్వే

తాంసి: జ్వర బాధితులను గుర్తించేందుకు ఇంటింటా ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేస్తున్నట్లు తాంసి పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ తులసీరాం అన్నారు. గురువారం మండల కేంద్రంలో సిబ్బందితో కలిసి ఇంటింటా సర్వే నిర్వహించి శాంపిళ్లు సేకరించారు. వారి వెంట ఏఎన్ఎం లక్ష్మి, ఆశ కార్యకర్తలు ప్రభావతి, లక్ష్మి ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ఇంద్రవెల్లి: మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఎస్సై దుబ్బాక సునీల్ హెచ్చరించారు. ఇటీవల మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురికి గురువారం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఉట్నూర్ కోర్టులో హాజరు పరిచి రూ. 1000 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు.

ఆర్థిక సాయం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వీడియో జర్నలిస్టు సుభాష్ కుటుంబానికి జర్నలిస్టు జేఏసీ ఆర్థిక సాయం అందించింది. గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు రూ.52 వేల నగదు అందజేశారు. జర్నలిస్టు జేఏసీ చైర్మన్ దేవేందర్, జర్నలిస్టులు సురేశ్, సారంగపాణి, సత్యం, అభిలాష్, అస్మత్ అలీ, నిలేష్, సుధాకర్ పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రానికి చెందిన కోట్రంగి అశోక్ అనే యువకుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా గ్రామానికి చెందిన అరవింద్ రెడ్డి, వెంకట్ రెడ్డిలు తమవంతుగా రూ. 11వేల నగదును సంతోశ్ రెడ్డి చేతుల మీదుగా అశోక్‌కు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బజార్‌హత్నూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం బీఎస్పీ అభ్యర్థి యాటకారి సాయన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరి పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో మాట్లాడారు. మెస్రం జంగుబాబు, గడుగు మహేందర్, రమేశ్, భూమన్న, లక్ష్మియాదవ్, జగన్మోహన్, విద్యాసాగర్, జయశీల పాల్గొన్నారు.

నేడు సమావేశం

బోథ్: కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి శుక్రవారం బోథ్ మండల కేంద్రానికి రానున్నారని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి తెలిపారు. సమావేశానికి పట్టభద్రులు, కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

మోటార్లు చోరీ

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామ శివారులోని ఇదపు పోశెట్టి రైతు చేనులో గుర్తు తెలియని వ్యక్తులు మోటారును దొంగలించారు. దీంతో పాటు పక్కన చేనులో ఉన్న రైతుల చేనులో కూడా మోటార్లను దొంగలించే ప్రయత్నం చేశారు. ఉదయం గమనించిన రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: పెన్‌గంగ చనాఖా కోరట నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మండలంలోని చాందా (టి) శివారు ప్రాంతంలో గురువారం పట్టుకున్నట్లు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. జరిమానా విధించేందుకు మైనింగ్ అధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఇంద్రవెల్లి మండలంలోని గౌరాపూర్‌కు చెందిన సక్రి అశ్విని అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ విష్ణుప్రకాష్ తెలిపారు. బుధవారం ఇంద్రవెల్లి నుంచి పూణెకు వెళ్లేందుకు ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌కు కుటుంబసభ్యులతో కలిసి వచ్చింది. వారందరు రైలు ఎక్కగా, ఆమెతో పాటు కుమార్తె పియు కనిపించకుండా పోయారు. దీంతో భర్త గోరక్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బాలిక కిడ్నాప్‌కు యత్నించిన వ్యక్తిపై కేసు

ఉట్నూర్‌రూరల్: బాలికను ప్రేమ పేరుతో కిడ్నాప్‌కు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రామయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న బాలికను జియా హక్ అనే వ్యక్తి తొమ్మిది నెలలుగా వేధిస్తున్నాడని పేర్కొన్నారు. గురువారం కాలేజీకి వెళ్లిన బాలికను జియా హక్ తన స్నేహితుడు సైఫ్‌తో కలిసి బలవంతంగా కారులో తీసుకెళ్లాడని తెలిపారు. బాలిక భయపడుతూ ఏడుస్తూ ఉండగా ఇంటికి పంపించాడని తెలిపారు. బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి


ప్యాడ్, పెన్నులు పంపిణీ చేస్తున్న సంతోష్

ఇంద్రవెల్లి: విద్యార్థులు పట్టుదలతో చదవి ఉన్నత స్థాయికి ఎదగాలని హైమన్‌డార్ఫ్ బెట్టి ఎలిజీబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్వ సంతోష్ అన్నారు. గురువారం మండలంలోని ముత్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఒక లక్ష్యంతో కష్టపడి చదవాలన్నారు. చదువుతోనే ఉజ్వాల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మాను కుమార్, ఉపాధ్యాయులు మెస్రం రవీందర్, గారుశే కిరణ్, నరేశ్, వెంకటేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

ఇచ్చోడ: బాల్య వివాహాలను అరికట్టే విధంగా ప్రతిఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఘర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో అవగాహన కల్పించారు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. చిన్న వయస్సులోనే ఆడపిల్లలకు పెళ్లిలు చేయడం ద్వారా వారికి పుట్టబోయే పిల్లలకు సైతం అంగవైకల్యం ఏర్పాడే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలు చేసినా.. ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ రోజ రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

'బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి'


సమావేశంలో పాల్గొన్న నాయకులు

నేరడిగొండ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని మాజీ జెడ్పీటీసీ గడ్డం భీంరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థితో పాటు ఉపాధ్యాయ సంఘాల నుంచి పోటీపడుతున్న కొమురయ్యను భారీ మెజార్టీతో గెలిపించి వారిని చట్టసభలకు పంపాలని కోరారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాంసి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోశ్ రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్ రెడ్డి, పోచ్చన్న, మహేందర్, పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి, అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమరయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని బజార్‌హత్నూర్, దేగామ, చందునాయక్‌తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ కొత్త శంకర్, చట్ల సుఖ్‌దేవ్, గాజుల రాకేశ్, జగదీష్, మల్లయ్య, రోజా, సుమలత పాల్గొన్నారు.

పీఆర్టీయూ అభ్యర్థిని గెలిపించాలి

ఆదిలాబాద్‌టౌన్: పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ టీఎస్ ముందుంటుందన్నారు.

నేటి నుంచి పెన్‌గంగా స్నానాలు

ఆదిలాబాద్‌టౌన్: భోరజ్ మండలంలోని కోర్టా శివాలయం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి శివరాత్రి వరకు పెన్‌గంగా స్నానాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కుంభమేళాను పురస్కరించుకొని ఉత్తరవాహిని గంగా స్నానాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్‌టౌన్: పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి దేవునూరి రవీందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. నిరుద్యోగుల కోసం ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

పోస్టర్ ఆవిష్కరణ

నార్నూర్: ఈనెల 24న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే లంబాడా గిరిజనుల ఆరాధ్యుడు శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలో ఉత్సవ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ అడే ప్రేమ్ మహరాజ్, ఫాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతరావు, అడే డిగాంబర్, రాథోడ్ సికేందర్, రాథోడ్ ఉత్తం, చౌహాన్ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో ఆలయ నిర్మాణం

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం పూర్తి కావడం సంతోషంగా ఉందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రూ.10 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సురేందర్ యాదవ్, అల్లకొండ ప్రశాంత్, ఎలుక రాజు, బొడ్డు శ్రీనివాస్ పాల్గొన్నారు.

లెక్చరర్‌కు డాక్టరేట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల లెక్చరర్ మహ్మద్ ముబారక్ డాక్టరేట్ పట్టాను పొందారు. గురువారం కళాశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈయన ఎలక్టోరల్ సిస్టమ్ అండ్ డెమోక్రటిక్ గవర్నెన్స్ ఎనలైజింగ్ ది ఎఫెక్ట్ ఆఫ్ ప్రపోషనల్ రిప్రజెంటేషన్ ఆఫ్ పొలిటికల్ స్టెబిలిటి అనే అంశంపై పరిశోధన చేశారు. డాక్టర్ మహేందర్ ఆధ్వర్యంలో పరిశోధన చేసి నీలం యూనివర్సిటీకి సమర్పించారు. యూనివర్సిటీ ఆయనకు ఇటీవల డాక్టరేట్‌ను ప్రకటించింది. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు కరుణాకర్, రేఖ, కోటయ్య, చంద్రకాంత్, స్వప్న, అనిత, యాఖుబ్ అలీ పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

తలమడుగు: మండలంలోని దేవపూర్ గ్రామానికి చెందిన సవారీ బంగ్లా స్థలాన్ని ఒక వర్గం వారు అక్రమించుంకుంటున్నారని గురువారం గ్రామస్తులు డిప్యూటీ తాహసీల్దార్ ప్రభాకర్, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ దేవాపూర్ గ్రామంలోని సవారీ బంగ్లా స్థలం గత దశాబ్దాల నుంచి పీర్ల పండుగ కోసం ఉపయోగిస్తున్నారన్నారు. కబ్జా చేసేందుకు ప్రయత్నించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జీవిత బీమా ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: జీవిత బీమాలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని అఖిల భారత జీవిత బీమా ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ జీవిత బీమా సంస్థలో బేస్ క్యాడర్ అయినటువంటి 3,4 తరగతుల ఉద్యోగ నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలతో నష్టపోతుందన్నారు. ఏఐఐఈఏ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫహీమ్ సిద్దీఖి, రాజేంద్ర ప్రసాద్, శ్రీరామ్, సాయికృష్ణ, సుమన్ రెడ్డి, నీలానంద రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఎల్‌పీవో

సిరికొండ: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపర్చి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీవో ఫణీంధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల, జెడ్పీ పాఠశాల్లో పర్యటించిన ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులకు హాజరు కావాలన్నారు. అనంతరం జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయనతో పాటు ఎంపీడీవో రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోథ్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా


పూజలు నిర్వహిస్తున్న గజేందర్

బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రాన్ని అన్నివిధాలుగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలోనీ హనుమాన్ ఆలయంలో నిర్వహించిన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సామాజిక కార్యకర్త సొసైటీ డైరెక్టర్ చట్ల ఉమేష్ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ గురువారం మండలంలోని వడూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యల గురించి గ్రామస్తుల ద్వారా అడిగి తెలుసుకున్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి


దిశానిర్దేశం చేస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో కాంగ్రెస్ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ బూతుల వారీగా ఇన్‌చార్జిలు కష్టపడి పని చేయాలన్నారు. ప్రతి ఇంటికీ పోలింగ్ స్లిప్పులతో పాటు కరపత్రాలు అందించాలని కోరారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హీరాసుక జయంతి విజయవంతం చేయండి


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న తుడుందెబ్బ నాయకులు

బజార్‌హత్నూర్: హీరాసుక జయంతిని విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు ఉయికే సుదర్శన్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో హీరాసుక జయంతి కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు జల్కే పాండురంగ్, నైతం రమేశ్, ఉత్తం, ఇస్తారి, గంగాధర్, ముకుంద్‌రావ్, పెందుర్ ఈశ్వర్, భీంరావ్, నాందేవ్, నగేశ్, దేవిదాస్ పాల్గొన్నారు.

బాల్య వివాహ ముక్త్ భారత్ కోసం కృషి చేయాలి


అవగాహన కల్పిస్తున్న సతీష్

నేరడిగొండ: దేశ ప్రధాని ఇచ్చిన పిలుపు మేరకు భారత దేశాన్ని బాల్య వివాహ ముక్తభారత్‌గా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోక్సో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, డీసీపీయూ ఎస్ఐసీ వినోద్, సోషల్ వర్కర్ రవికాంత్, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు


బహుమతులు అందజేస్తున్న దాతలు

తలమడుగు: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురష్కరించుకొని నిర్వహించిన అంతర్రాష్ట క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన జట్లకు తలమడుగు గ్రామానికి చెందిన దాతలు నగదు బహుమతులు అందజేశారు. కొత్తూరు గ్రామానికి చెందిన క్రికెట్ జట్టు గెలుపొందగా పిడుగు సంజీవరెడ్డి రూ. 40 వేల రూపాయలు అందజేశారు. కోసాయి టీంకు కాటిపెల్లి హరీశ్‌రెడ్డి రూ. 30 వేలు అందజేశారు.

ఎమ్మెల్సీ ఓటరు స్లిప్పుల పంపిణీ


ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

సిరికొండ: ఈనెల 27న జరగనున్న ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్‌ల పటబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్లుకు ఓటరు స్లిప్పులను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ తుకారం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతీ ఒక్క పట్టబద్రుడు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, బీఎల్‌వో మౌనజ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన వీడ్కోలు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బోథ్: మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం వీడ్కోలు కార్యక్రమంతో పాటు, కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్ రావు, ఎస్సై ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో రమేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని విజయం సాధించే దిశగా ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు చేసిన నత్యం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంగీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోదుగ పూల అందం


తాంసి: విరబూసిన మోదుగ పూలు


ఇచ్చోడ: దర్మంపూరి సమీపంలో..

ఇచ్చోడ/తాంసి: ఇచ్చోడ మండలంలోని దర్మంపూరి పొలం గట్లపై, భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి శివారులో మోదుగ పూలు కనువిందు చేస్తున్నాయి. ఎరుపు రంగులో విరబూసి అటు వైపు వెళ్లే వారిని ఆకట్టుకుంటున్నాయి.